సాక్షి ప్రకాశం

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



నిత్యం అందుబాటులో ఉంటా..

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో నిత్యం అందుబాటులో ఉండి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు.

- 8లో..



గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ తెలిపారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



గోదాములో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ తమీమ్ అన్సారియా త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం పరిశీలించారు. గోదాము షట్టర్లు తెరిచి ఈవీఎంలను పరిశీలించారు. ఈవీఎంల స్థితిగతులపై ఆరా తీశారు. గోదాము వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా, సత్యనారాయణ, రసూల్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం ఉత్తర్వులిచ్చారు. ఏడాదిన్నర క్రితం ఒంగోలులో ఏర్పాటు చేసిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఒకప్పుడు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్నాతకోత్తర కేంద్రంగా ఉంది. సదరు కేంద్రంలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిలో ఏకేయూ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నిర్మలామణి, డీన్ సీడీసీ డాక్టర్ జి.సోమశేఖర తదితరులను ఏఎన్‌యూ ప్రమోషన్ ప్యానెల్ కమిటీ ప్రొఫెసర్లుగా ఎంపిక చేశారు. దీంతో ఇప్పటి వరకూ అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉన్న డాక్టర్ నిర్మలామణి, డాక్టర్ సోమశేఖర్, తదితరులు ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. పదోన్నతి ఉత్తర్వులను శనివారం ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి చేతులమీదుగా వారిద్దరూ అందుకున్నారు.

ఫ్రీ హోల్డింగ్ పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

- సీసీఎల్‌ఏ జయలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని, దానిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్లకు సీసీఎల్‌ఏ జయలక్ష్మి సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రీ హోల్డింగ్‌కు సంబంధించి జిల్లాలో పరిస్థితులను కలెక్టర్ వివరించారు. పరిశీలన కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

అక్టోబర్ 1న అండర్-14, 17 ఎంపిక పోటీలు

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలలకు చెందిన బాలబాలికలకు ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14, 17 విభాగాల ఎంపిక పోటీలను అక్టోబర్ 1వ తేదీ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 కార్యదర్శి కె.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్ బాల్ పోటీలు జరుగుతాయన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా, కొత్తపట్నం మండలం గమళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెజ్లింగ్, గిద్దలూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గల శాఫ్‌టెన్నిస్ కోర్టులో టెన్నిస్ పోటీలు నిర్వహిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయించి మాన్యువల్ ఎంట్రీ ఫాంతో పంపాలని సూచించారు. అండర్-17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్మీడియట్ విద్యార్థులు పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో రావాలని వివరించారు.



ఒంగోలు సంతపేటలో పూజల అనంతరం వైఎస్సార్ సీపీ శ్రేణులతో చెవిరెడ్డి భాస్కరరెడ్డి



తాళ్లూరు మండలం గుంటిగంగాభవానీ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు



సింగరాయకొండలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

వెంకన్న లడ్డూపై..

మహాపచారం..!



ఒంగోలు సంతపేటలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, నాయకులు

- బాబు కుట్రలపై భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో పూజలు
- చంద్రబాబు బుద్ధి మార్చాలంటూ వేడుకోలు
- తిరుమల లడ్డూపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టిన నాయకులు

ఒంగోలు:

కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తిప్పికొట్టారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపుతో జిల్లావ్యాప్తంగా శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల పుణ్యక్షేత్రం ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించడం చంద్రబాబుకు చేస్తున్న కుట్రలకు నిదర్శనమని మండిపడ్డారు. వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు టీటీడీ లడ్డూలో కల్తీ నెయ్యి వాడారంటూ వివాదాన్ని చంద్రబాబు తెరపైకి తెచ్చి మహాపచారానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం చంద్రబాబు వక్రబుద్ధిని మార్చాలంటూ దేవుళ్లను వేడుకున్నారు.

★ ఒంగోలులోని సంతపేట సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, నగర అధ్యక్షుడు కటారి శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ లడ్డూపై ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించి నీచ రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వెంకన్నను వేడుకున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేవదేవుడ్ని వాడుకోవాలనుకోవడం అనైతికం, అపవిత్రం అని, దేవుడు చంద్రబాబును క్షమించడని చెవిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేశారు. మరోవైపు వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక నెల్లూరు బస్టాండులోని విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు. కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించమని వేడుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, నాయకులు వై.వెంకటేశ్వరరావు, కటారి ప్రసాద్, కేవీ ప్రసాద్, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, గంగవరపు ప్రవీణ్‌కుమార్, వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల రామారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చుండూరి రవిబాబు, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్, కార్మిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ పెద్దిపోగు కోటేశ్వరరావు, కొత్తపట్నం జెడ్పీటీసీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు మాజీ జెడ్పీటీసీ మట్టి రాఘవ, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ తాత నరసింహగౌడ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ముల్లంగి రవీంద్రారెడ్డి, నలమలపు కృష్ణారెడ్డి, ముఖ్య నాయకులు నరాల రమణారెడ్డి, దాసరి కరుణాకర్, బాకా బ్రదర్స్, అన్నె శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డి రవణమ్మ, బత్తుల ప్రమీల, హౌసింగ్ బోర్డు చిన్న, సామంతుల వీరారెడ్డి, తిరుమలరెడ్డి, దమ్మాల సుబ్బారావు, తిరుమలరాజు శ్రీనివాసరాజు, 2వ క్లస్టర్ ఇన్‌చార్జి రాయపాటి అంకయ్య, గుత్తికొండ నారపరెడ్డి, భాస్కర్, మాదిగ జనసేవా సమితి జిల్లా కో ఆర్డినేటర్ గద్దల వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ నగర మాజీ అధ్యక్షుడు షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

★ కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండలో షిర్డీ సాయిబాబా ఆలయంలో, టంగుటూరులోని పోలేరమ్మ తల్లి ఆలయంలో మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. షిర్డీ సాయి ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యెన్నాబత్తిన చిన్న, కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి పాల్గొన్నారు.

★ సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలంలోని మల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగు నాగార్జున ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ మండలాల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, మండవ అప్పారావు, ఇనగంటి పిచ్చిరెడ్డి, నలమలపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

★ దర్శిలో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటిగంగాభవానీ అమ్మవారి ఆలయంలో, దర్శి మండలం వెంకటాచల క్షేత్రంలోని శ్రీలక్ష్మీపద్మావతి అమ్మవారి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు ప్రభుత్వ వ్యాఖ్యలను ఖండిస్తూ బూచేపల్లి వెంకాయమ్మ విమర్శలు చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమిత అంజిరెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

★ మార్కాపురంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో, కొనకనమిట్ల మండలం వెలిగొండ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పాదిలి వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

★ కనిగిరిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ మాజీ చైర్మన్ బన్నీ, జెడ్పీటీసీ కస్తూరారెడ్డి, ఎంపీపీ ప్రకాశం, కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ సాల్మన్, కనిగిరి మున్సిపల్ చైర్మన్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

★ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తిరుమల వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, కూటమి ప్రభుత్వం రాజకీయాల కోసం టీటీడీ లడ్డూను సైతం వదలకుండా మతవిద్వేషాలు రెచ్చగొడుతోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, దుగ్గెంపూడి వెంకటరెడ్డి ఉన్నారు. తాటిపర్తి పిలుపు మేరకు యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు భారీగా పాల్గొన్నారు.

★ గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో చంద్రబాబు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద టెంకాయలు కొట్టి కూటమి నాయకులు చేసిన తప్పులను క్షమించమని, ప్రజలపై కోపం తెచ్చుకోవద్దని వెంకటేశ్వరస్వామిని వేడుకున్నారు.



మల్లవరంలో పూజల అనంతరం వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో మాజీ మంత్రి మేరుగు



కనిగిరిలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దద్దాల నారాయణయాదవ్, పార్టీ శ్రేణులు



తిరుమలలో వెంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం నాయకులతో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



పాదిలి దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ శ్రేణులు

పోరాట యోధుడు.. గుర్రం జాషువా

- సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం
- సంఘ సంస్కరణ దిశగా ఆయన సాహిత్యం అనిర్వచనీయం
- జయంతి వేడుకల్లో కలెక్టర్ తమీమ్ అన్సారియా



గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్

ఒంగోలు అర్బన్: సమాజంలో కులవివక్ష, సామాజిక అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు గుర్రం జాషువా అని, ఆయన ఆదర్శాలు మనకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా కొనియాడారు. జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని గుర్రం జాషువా సాహిత్య, సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనం ప్రాంగణంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి జాషువా విగ్రహానికి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంఘ సంస్కరణ దిశగా సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని జాషువా చేసిన రచనలు అనిర్వచనీయమన్నారు. కవిగా, సంఘ సంస్కర్తగా విశేష కృషి చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి జాషువాను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ కవిగా, మానవతావాదిగా సామాజిక అభ్యున్నతికి జాషువా చేసిన కృషి ఎంతో విలువైందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు కూడా జాషువా రచనలు పాఠ్యాంశాలుగా ఉన్నాయని, సామాజిక సంస్కర్తగా ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక రుగ్మతలపై రచనలతో తనదైన ముద్ర వేసిన కవి గుర్రం జాషువా అని కీర్తించారు. ఆయన ఆదర్శాలను నేటి యువత తెలుసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. గబ్బిలం, పిరదౌశి వంటి రచనలు ప్రతిఒక్కరూ చదివి చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్, గుర్రం జాషువా సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి ఎండ్లూరి రవికుమార్, ఎంఆర్‌పీఎస్ కో కన్వీనర్ పానుగంటి షాలేమురాజు, జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి, ఎంఎస్‌పీఎస్ అధ్యక్షుడు కొమ్ము సుజన్, కవులు కత్తి కళ్యాణ్, గంగవరపు సునీత, సామాజిక ఉద్యమకారులు సుధాకర్‌బాబు, అంగలకుర్తి ప్రసాద్, శ్రీరామకవచం సాగర్, నేదరపల్లి జయరాజు, రేనమాల, మాధవ, శరత్, చంద్రబోస్, గరటయ్య పాల్గొన్నారు.

రేపు అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జట్ల ఎంపికను ఈ నెల 30వ తేదీ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి ఈ చింపారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సింగరాయకొండ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, తైక్వాండో క్రీడాంశాలకు సంబంధించి జిల్లా స్థాయి బాలబాలికల జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హిందుత్వం అంటేనే మతసామరస్యానికి ప్రతీక

- అందుకే తిరుమల ఆలయంలో ఢిల్లీ సుల్తాన్ కుమార్తె బీబీ నాంచారమ్మ విగ్రహం
- ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తుల ఆరాధ్యదైవం శ్రీ వెంకటేశ్వరస్వామి
- ఒంగోలులో ప్రత్యేక పూజల అనంతరం మీడియాతో చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఒంగోలు: హిందుత్వం అంటేనే మతసామరస్యానికి ప్రతీక అని, అందువల్లే నాటి ఢిల్లీ సుల్తాన్ కుమార్తె బీబీ నాంచారమ్మ విగ్రహం తిరుమల ఆలయంలో ఉందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. టీటీడీ లడ్డూపై ఉద్దేశపూర్వకంగా వివాదం సృష్టించి నీచ రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఒంగోలులోని సంతపేట సాయిబాబా ఆలయంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో చెవిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం దేవదేవుడ్ని వాడుకోవాలనుకోవడం అనైతికం, అపవిత్రం అని అన్నారు.

అన్ని వ్యవస్థలకు మాదిరే దేవాలయ వ్యవస్థను అపవిత్రం చేయాలనుకుంటే దేవదేవుడు ఇప్పటికిప్పుడు ఏమీ చేయకపోవచ్చుగానీ.. ఎప్పటికీ క్షమించడని చంద్రబాబును హెచ్చరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 5 సార్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారని, అదే విధంగా పదుల సార్లు శ్రీవారిని దర్శించుకున్నారని అన్నారు. తండ్రికి ఏం వర్తిస్తుందో కొడుకుకు కూడా అదే వర్తిస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రను ప్రారంభించిందే తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని అని తెలిపారు. పాదయాత్ర ముగిసిన తర్వాత కూడా నేరుగా శ్రీవారి ఆలయానికి మెట్ల మార్గాన చేరుకుని స్వామివారిని దర్శించుకున్న అనంతరమే ఆయన ఇంటికి చేరుకోవడం జరిగిందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం 5 సార్లు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారని, ఆ వస్త్రాలను స్వామివారికి కట్టడం కూడా జరిగిందని తెలిపారు. ఇప్పుడు తప్పుడు ఆరోపణలతో జరగనిది జరిగినట్లుగా నిందలు వేయడం దారుణమని చెవిరెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా 6709 దేవాలయాలకు ధూపదీప నైవేద్యాలకు నిధులు కేటాయించడం, 500 వెంకటేశ్వరస్వామి ఆలయాలను దళితవాడల్లో నిర్మించడం, 40 వేల మంది అర్చకులకు కరోనా సమయంలో రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం, 3,400కుపైగా ముంబై, చెన్నై, ఢిల్లీ, కురుక్షేత్రంతో సహా చివరకు జమ్మూలో సైతం బ్రహ్మాండమైన వెంకన్న ఆలయాలను నిర్మించిన విషయాన్ని వివరించారు. వెంకన్నపై ఇంతటి అచంచలమైన భక్తిప్రపత్తులను జగన్మోహన్‌రెడ్డి కలిగి ఉంటే.. నేడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నవారిని దేవదేవుడు క్షమించేది ఉండదన్నారు. చెవిరెడ్డి వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకటి నుంచే పెన్షన్‌లు పంపిణీ చేయండి

● జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: అక్టోబర్ 1న ఉదయం 5 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శనివారం పెన్షన్ల పంపిణీపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. అక్టోర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా సెలవు కావడంతో 1వ తేదీనే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2,88,144 మంది పెన్షన్ లబ్ధిదారులున్నారని వారికి కేటాయించిన రూ.122.64 కోట్లు ఈ నెల 30వ తేదినే బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు. పంపిణీ పర్యవేక్షించేందుకు ఎంపీడీఓ కార్యాలయాల్లో కంట్రోలు రూము ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర 2047కు సంబంధించి ఏయే రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలో ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. ప్రతి సచివాలయ ఉద్యోగి కనీసం 100 మందిని సర్వే చేసి అభిప్రాయం సేకరించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఎల్‌డీఎం రమేష్ తదిరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సింగరాయకొండ-ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

సింగరాయకొండ: మండలంలో శనివారం శానంపూడి నుంచి సింగరాయకొండకు ఇసుక అక్రమంగా తరలిస్తుండగా తహసీల్దార్ టి. రవి తన సిబ్బందితో దాడి చేసి కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో శానంపూడి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఒక్కో ట్రాక్టరుకు రూ. 10వేల చొప్పున జరిమానా చెల్లించి తీసుకుని వెళ్లాలని ఆదేశించారు. 'వీళ్లు కన్నేస్తే కొల్ల గొట్టేస్తారు' అన్న శీర్షికపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించి మొక్కుబడిగా రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుమల్లి మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను నందనవనం రోడ్డు ద్వారా కలికవాయ మీదుగా యథేచ్ఛగా ట్రాక్టర్లు ద్వారా తరలించారతని గ్రామస్తులు వివరించారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఈనెల 26వ తేదీన ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరిగిన జిల్లా రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ముక్తినూతలపాడు విద్యార్థులు ఇరువురు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. టి.ప్రసన్న ఏడవ తరగతి, చైతన్య ఏడో తరగతి అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు త్వరలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగే రాష్ట్ర పోటీలకు జిల్లా నుంచి హాజరవుతారు. హెచ్‌ఎం దేవసేన, పీడీ జి. ప్రభాకర్, పీఈటీ రామాంజనేయులు బాబు తదితరులు అభినందించారు.

నిత్యం అందుబాటులో ఉంటా!

● పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం
● ఎమ్మెల్యే అభ్యర్థులకన్నా 52వేల మంది ఓటర్లు అధికంగా నాకు మద్దతు పలికారు
● పార్టీ నాయకులు, కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర రెడ్డి



పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డి

ఒంగోలు: స్థానిక పార్లమెంట్ పరిధిలోని ప్రతి నాయకుడు, కార్యకర్తకు నిత్యం పార్టీ జిల్లా కార్యాలయంలోనే అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన కొద్దిసేపు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ పరిధిలో తనకు ఎమ్మెల్యే అభ్యర్థులకన్నా 52 వేలమంది ఓటర్లు అధికంగా తనకు మద్దతు పలికారన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో సైతం 3వేల మందికిపైగా తనకు ఓటేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు పార్టీ కార్యాలయంలోనే నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. తనకు ఇంత పెద్ద ఎత్తున మద్దతు పలికిన ఓటర్లకు సేవ చేసేకునే భాగ్యాన్ని వదులుకోనన్నారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. పార్టీకి అంకిత భావంతో ఉన్న కార్యకర్తల జోలికి టీడీపీ కూడా నేరుగా రాలేదని, ఒక వేళ ఎవరైనా అధికారులను అడ్డం పెట్టుకుని ఇబ్బంది పెట్టాలని చూస్తే మాత్రం న్యాయబద్ధంగా పోరాడతామన్నారు. అలాంటి అధికారులు రిటైర్డ్ అయినా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. కొంత మంది కార్పొరేటర్లు తల్లిలాంటి పార్టీని వీడారని, అయినా వాళ్లు తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో తల్లి చెంతకు తిరిగి వస్తారని భావిస్తున్నామంటూ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

● వారికి లైసెన్స్‌లు ఇవ్వాలి
● లోన్లు ఇచ్చి ఆర్థికంగా ఎదిగేలా ఆదుకోవాలి
● కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్



సమావేశం నిర్వహిస్తున్న జాటోత్ హుస్సేన్, కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొత్తపట్నం: గిరిజన సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలో రంగాయపాలెం తుఫాన్ షెల్టర్‌లో శనివారం యానాది సామాజికవర్గం వారితో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగన్నాథరావు అధ్యక్షత వహించారు. ముందుగా యానాది వాసుల సమస్యలు గురించి తెలుసుకున్నారు.

ఆ ప్రాంత యానాది వాసులు మాట్లాడుతూ బకింగ్ హామ్ కెనాల్‌ను ఆధారంగా చేసుకుని చేపలు పట్టేవారికి లైసెన్సులు మంజూరు చేయాలని కమిషన్ సభ్యులు దృష్టికి తీసికెళ్లారు. జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ వెంటనే బకింగ్‌హామ్ కెనాల్ పరిధిలో చేపలు పట్టే వృత్తిపై ఆధారపడి జీవించే వారికి లైసెన్సులు మంజూరు చేయాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ తెగల కమిషన్ ఉందన్న విషయం ఇప్పటికీ వారిలో ఎక్కువమందికి తెలియదని.. దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. పట్టిన చేపలు తీసుకోవాడానికి ద్విచక్రవాహనాలు, సైకిల్ కూడా ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ నెల రోజుల్లోపు తమ సిబ్బంది ఇంటింటికీ తిరిగి అర్హులకు పంపిణీ చేస్తారన్నారు. పట్టిన చేపలను తెచ్చుకునేందుకు ఎలక్ట్రికల్ వాహనాలను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలయినా ఆదివాసీలయుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం గుర్తించి రాష్ట్రపతి ఆదివాసీ.. బిడ్డలకు ఇవ్వడం సంతోషకరమైన విషయమని తెలిపారు. లైసెన్స్‌లు ఇస్తే జీవితాంతం అధికారులను గుర్తిపెట్టుకుంటారన్నారు. షెడ్యూల్డ్ తెగలకు కార్పొరేషన్ నిధులు కోట్లు మురిగిపోతున్నాయన్నాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. మీ పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, మత్స్యశాఖ జేడీ ఆవులు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, తహసీల్దార్ మధుసూధన్‌రావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ సభ్యులు, రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివారెడ్డి, సత్యం, యానాది కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎన్నోసార్లు అడిగి అలిసిపోయాం

యానాదులకు లైసెన్స్‌లు గురించి 15 సంవత్సరాల పాటు అడిగి అలసిపోయామని.. ఇప్పుడు ఏమి ఇస్తారని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ఆఫీసులు చుట్టూ తిరిగి చెప్పులు అరిగిపోయేలా తిరిగామన్నారు. ఇటువంటి సమావేశాలు చాలా సార్లు పెట్టారని.. కానీ లైసెన్స్‌లు మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఇప్పుడేమి ఇస్తారు అని ప్రశ్నించారు. లైసెన్స్‌లు ఇవ్వకపోవడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు కోల్పోతున్నామని వాపోయారు. ఇప్పటి కైనా లైసెన్స్‌లు ఇచ్చి ప్రభుత్వ నుంచి వచ్చే రాయితీలను వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

ఒంగోలు అర్బన్: గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని.. అందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజనుల అభివృద్ధి కోసం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమానికి అమలు చేస్తునన కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో గిరిజన కుటుంబాలకు అందేలా పక్కాగా అమలు చేయాలన్నారు. గిరిజన స్థితిగతులను ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని ఆయా వర్గాల ప్రజలకు న్యాయం చేయాలన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చెంచు గూడేల్లో మౌలిక వసతులు కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జన్‌మన్ కార్యక్రమం కింద చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్ మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు పలువురు గిరిజన ప్రజలు వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ అట్రాసిటీ కేసులకు సంబంధించిన బాధిత కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ బోగస్ కుల ధ్రువీకరణతో ప్రభుత్వ ఉద్యోగాలు పొంది ఉన్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా భూ సమస్యలు ఉన్నట్లు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాల కృష్ణ, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, ఐటీడీఏ పీఓ సురేష్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



గిరిజన సమస్యల గురించి మాట్లాడుతున్న షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్



గిరిజన సమావేశానికి హాజరైన యానాదులు

ఉల్లాసంగా 3కే వాక్ అండ్ రన్



3కే వాక్ అండ్ రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్



నగరంలో వాక్ అండ్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

● ఆరోగ్యకర జీవన శైలితో దీర్ఘాయుష్షు
● ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలంగా ఉంటుందని, ఇలా సంతోషంగా ఎక్కువ కాలం జీవించవచ్చని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని శనివావారం పోలీసు శాఖ, కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో 3కే వాక్ అండ్ రన్ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి సాగర్ సెంటర్, కొత్త కూరగాయల మార్కెట్ సెంటర్, గాంధీ పార్క్, మంగమూరు జంక్షన్ మీదుగా పోలీసు కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. గుండె ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని, రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను సాధారణ స్థాయిలో ఉంచుకుంటే గుండె జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ప్రతి రోజూ తగిన వ్యాయమం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం, ఆలోచనలు, సరిపడా నిద్ర, మానసికంగా సంతోషంగా గడపడం, సానుకూల దృక్పథం కలిగి ఉండటం వంటివి మనిషిని ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచుతాయని తెలిపారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని, ప్రతి ఏడాది తప్పనిసరిగా గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను చేయించుకొని డాక్టర్ల సూచనలు, సలహాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైం) యస్‌వీ శ్రీధర్ రావు, ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఎఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరిబాబు, సీఓఓ అంకిరెడ్డి, మెడికల్ సూపరెంటెండెంట్ శ్రీహరి రెడ్డి, వైద్యులు హరీష్, లక్ష్మణ్ రెడ్డి, కపిలశ్ కార్తికేయ రెడ్డి, ఆనంద్ యాదవ్, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమేష్ కృష్ణణ్, రమణా రెడ్డి, పోలీసు సిబ్బంది, కిమ్స్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



పోలీసు మెడికల్ క్యాంప్ ప్రారంభిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

ఒంగోలు టౌన్: గుండెపోటుకు గురైన వ్యక్తులను వైద్యశాలకు తరలించేలోపు ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను రక్షించదానికి సీపీఆర్ విధానం మంచిదని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. దీనిపై పోలీసులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నగరంలోని పోలీసు కల్యాణ మండపంలో కిమ్స్ వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సీపీఆర్ ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడారని, పోలీసులు అందులో శిక్షణ పొందాలని చెప్పారు. గుండె సంరక్షణ, సంబంధిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతల గురించి అధ్యయనం చేయాలన్నారు. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్ల వలన గుండె జబ్బులు పెరుగుతున్నాయని వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలని చెప్పారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని, సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్రలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణతో పాటు కుటుంబ సంక్షేమానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పోలీసు సిబ్బంది దేహదారుఢ్యాన్ని కాపాడుకుంటూనే ఫిట్‌నెస్‌గా ఉండాలన్నారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలను అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ ఐడీ కార్డు తమ వైద్యశాలలో చికిత్స పొందే సౌకర్యాన్ని కలిగిస్తున్నట్లు కిమ్స్ వైద్యశాల ప్రతినిధి తెలిపారు. పోలీసు శాఖకు బ్లడ్ కౌంటర్ మిషన్‌ను కిమ్స్ తరఫున బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు యస్‌వీ శ్రీధర్ రావు, కె. నాగేశ్వరరావు, అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, కిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. గిరినాయుడు, సీఓఓ అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, వైద్యులు లక్ష్మణ్ రెడ్డి, కార్తికేయ, పోలీసు మెడికల్ యూనిట్ వైద్యురాలు భానుమతి, డీపీఓ సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లే లోపే కబళించిన మృత్యువు

● ఆగి ఉన్న లైలాండ్ వాహనాన్ని ఢీకొట్టి మోటార్ సైక్లిస్ట్ మృతి



ఘటనా స్థలం వద్ద పడి ఉన్న మృతుడు

పామూరు: ఆగిఉన్న వాహనాన్ని ఢీకొట్టిన మోటార్ సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన శనివారం రాత్రి రావిగుంటపల్లె సమీపంలో 565 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాలు.. మండలంలోని రావిగుంటపల్లె కొత్తపల్లె గ్రామానికి చెందిన తాతిరెడ్డి వీరనారాయణరెడ్డి సమీపంలోని అడ్డరోడ్డు వద్ద వ్యక్తిగత పనిపై వెళ్లి పనిముగించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. అప్పటికే జాతీయ రహదారిపై మరమ్మతులకు గురై ఒక మినీ ట్రాలీ వాహనం ఆగిపోగా దానిని తీసుకుపోయేందుకు వాహనదారులు అశోక్ లేలాండ్ వాహనం తెచ్చి మరమ్మతులకు గురైన వాహనానికి తాడుతో కడుతున్నారు. అదేసమయంలో అడ్డ రోడ్డు నుంచి బైక్‌పై వస్తున్న తాతిరెడ్డి వీరనారాయణ బైక్ అదుపుతప్పి లేలాండ్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో వీరనారాయణరెడ్డి (33) రోడ్డుపై పడి తలకు తీవ్రగాయాలై పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఒడిస్సాలో బొరుగుల బట్టీ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడున్నారు.

ఇంటికి కిలోమీటర్ దూరంలో ఉండగా..

తాతిరెడ్డి వీరనారాణరెడ్డి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న తన ఇంటికి కేవలం నిముషాల్లో పోయేవాడు. ఇంతలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మరో 10 నిమిషాల్లో భర్త ఇంటికి వస్తాడనుకుని ఎదురు చూస్తున్న భార్య, నాన్న ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న పిల్లలకు మృతి వార్త తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా సోమవారం ఒడిస్సాలోని బొరుగుల బట్టీ వద్దకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరికి తరలించనున్నారు.

జిల్లా స్థాయి పోటీలకు చీమకుర్తి విద్యార్థులు

చీమకుర్తి: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్, వాలీబాల్ పోటీల్లో చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల హైస్కూలు నుంచి పలువురు బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ డీ స్వరూపావాణి తెలిపారు. ఎంపికైన వారిలో ప్రియాంక, పవిత్ర, ద్రాక్షావలి, మందా దీక్ష, కృప, శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు. వారిని ప్రధానోపాధ్యాయులు వీరాస్వామి, జట్ల రవి, టీచర్లు అభినందించారు.

దేవరపాలెం విద్యార్థుల ప్రతిభ...

దేవరపాలెం జిల్లాపరిషత్ హైస్కూలుకు చెందిన వెంకటలక్ష్మి, సృజన, కిషోర్ జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్థానిక హెచ్‌ఎం తెలిపారు. అదేవిధంగా మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో తమ విద్యార్థులు చరిత, నీలిమ ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు.

జగన్‌మోహన్‌రెడ్డి విదేశీయుడా.. డిక్లరేషన్ ఇవ్వడానికి..?

● కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: విదేశీయులు, అన్యమతస్తులు మాత్రమే టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇస్తారని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీయుడా..? అని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ నిలదీశారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సద్బుద్ధి రావాలని కోరుతూ శనివారం దేవాలయాల్లో పూజలు చేశారు. సింగరాయకొండలోని షిరిడీ సాయిబాబా మందిరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ వ్యక్తి అయినా మనసులో నిస్కల్మషంగా మనసా వాచా కర్మేణా స్వామివారిని నమ్మాను, హిందు ధర్మాన్ని గౌరవిస్తానని ఆత్మ పరిశీలన చేసుకుని నిండు మనసుతో, చిత్తశుద్ధితో గుడిలోకి అడుగుపెడితే చాలని, అంతేగాని డిక్లరేషన్ దేనికని ప్రశ్నించారు. జగనన్న ఏమైనా బ్రిటీషియన్, యూరోపియన్, వేరే దేశంలో ఉంటున్నాడా, లేక వేరే మతస్తుడా అని విస్మయం వ్యక్తం చేశారు. టీటీడీ నిబంధనలు అన్యమతస్తులకుగానీ.. హిందువులకు కాదని అన్నారు. చట్టంలో ఉన్న లొసుగులు అడ్డం పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచే విధంగా సంతకం పెట్టమని డిమాండ్ చేయడం దారుణమన్నారు. జగనన్న ఇంటి వద్ద బైబిల్ చదువుతానని చెప్పాడని, భారత రాజ్యాంగ ప్రకారం పర్వమానవ సమానత్వం సౌభ్రాతృత్వం ప్రతి వ్యక్తికి వర్తిస్తుందని గుర్తు చేశారు. భారతదేశం లౌకికవాద దేశమని, ఒక మతానికి చెందిన దేవుడిని కొలిస్తే మరొక మతానికి చెందిన దేవుడిని కొలవకూడదా అని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పనితీరు ఎలా ఉందంటే.. అడవిలో ఉండి చెట్లను వెతికినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. జగనన్న హిందూ మతాన్ని గౌరవిస్తాననడానికి ఉగాది పండుగను జరిపే విధానమే నిదర్శనమన్నారు. జగనన్న వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తుంటే.. ఏదో విధంగా అప్రతిష్ట పాలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. భగవంతుడిని రాజకీయాల కోసం వాడవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. జగనన్నను తిరుమలకు రాకుండా పార్టీ నాయకులకు నోటీసులు ఇచ్చి అడ్డుకున్నారని, మా నాయకుడు జగనన్న ఆధారాలు చూపిస్తే చంద్రబాబు నేతిలో జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం ఎంత నిజమో, నోటీసులు ఇవ్వలేదని, అడ్డుకోలేదని చెప్పడం అంతే నిజమని మాజీ మంత్రి సురేష్ చంద్రబాబు నైజాన్ని ఎండగట్టారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.